క్లుప్తంగా

సేవలోనే సంతృప్తి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న లోకనాథం

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలోనే సంతృప్తి ఉందని వ్యాపారవేత్త నాగమల్లి లోకనాథం అన్నారు. కణపాక అగురవీధిలో శుక్రవారం 100 మంది పేదలకు బియ్యం, గోధుమనూక, నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. మారుతీ స్వయం సహాయక సంఘ సభ్యులు పేదలకు పదిహేనుళ్లుగా సాయం అందించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవరుచు కోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్, గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవలసలో 'గడప గడపకూ సంక్షేమం'



లబ్ధిదారులకు లేఖ అందిస్తున్న వలంటీర్లు, నాయకులు

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో గడప గడపకూ సంక్షేమ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అందించిన లేఖలను అందించారు. ఐదేళ్లగా ఒక్కొక్కరూ ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ లబ్ధిని వలంటీర్లు ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

డెంకాడ: సమాజ్‌వాది పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన కర్రి కృష్ణ అన్నారు. పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ జాలాది విజయ శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కృష్ణకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంభాన శ్రీనివాసరావు, తాజ్ మొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ అంతరాయానికి సహకరించాలని సబ్‌స్టేషన్ ఏఈ పిచ్చయ్య కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబునగర్ ఫీడర్‌లో చెట్ల తొలగింపులు, మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదన్నారు. అగురువీధి, జంగాల వీధి, గాంధీనగర్ కాలనీ, కీర్తివీధి, శ్రీరామ్‌నగర్ కాలనీ, బైరెడ్డివీధి, ఎస్సీ కాలనీ, ఇందిరాకాలనీ, చంద్రబాబునగర్ కాలనీ, డైట్ కాలనీ, తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురుకుల ప్రవేశ పరీక్ష రేపు

నెల్లిమర్ల: అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె. ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఉదయం పది నుంచి 12 గంటల వరకు.. ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకుని గంట ముందుగా ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో పరీక్ష కేంద్రంలో హాజరుకావాలని కోరారు.

11, 12 తేదీల్లో మెరకతల్లి వారాల జాతర



మెరకముడిదాం: మెరకముడిదాం, సోమలింగాపురం, ఎం.పాలెం గ్రామాల ఇలవేల్పు, కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీమెరకతల్లి అమ్మవారు వారాల జాతరను ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్టు మూడు గ్రామాలకు చెందిన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారాల జాతరను మూడు గ్రామాలలో వున్న ఆలయాలతో పాటు మూడు గ్రామాల మధ్యలో వున్న ప్రధాన ఆలయం వద్ద నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత

శృంగవరపుకోట: పుణ్యగిరి క్షేత్రంలో ఉన్న దారగంగమ్మ లోయలో అమ్మవారికి నిత్యం పూజలు చేసే పూజారి గేదెల గంగతల్లి శుక్రవారం పాము కాటుకు గురైంది. శుక్రవారం ఉదయం దారగంగమ్మలోయ వద్ద పైన ఉన్న గుహలో ఆమె పూజ చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో అక్కడే ఉన్న భక్తులు సమాచారం ఇవ్వటంతో స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందివ్వటంతో ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు.

నాగేంద్ర హారాయ..త్రిలోచనాయ..

- శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు
- పోటెత్తిన భక్తులు

విజయనగరం టౌన్: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఉన్న అన్ని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము 3 గంటల నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో స్వహస్తాలతో మహాశివలింగానికి అభిషేకాలు చేశారు. నగరంలోని ఎస్‌వీఎన్ నగర్‌లో ఉన్న పశుపతి నాథేశ్వరస్వామి ఆలయంలో కొలువైన ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించి, అభిషేకాలు చేశారు. అనంతరం స్ఫటిక లింగాన్ని దర్శించి, తన్మయత్వం చెందారు. ఆలయ ఆవరణలో దీపారాధనలు చేశారు. శారదా సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సుమారు 300 మందితో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన అతిపురాతనమైన శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ సభ్యులు, సేవకులు విశేష సేవలందించారు. బాబామెట్టలో ఉన్న శివపంచాయతన ఆలయంలో ఆలయ చైర్మన్ కేవీపీ రాజు, కార్యదర్శి శివ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహాశివునికి విశిష్ట పూజలు చేశారు. విమర్శ ప్రకాశ దేవాలయంలో అర్చకుడు నాగరాజుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఈఓ జగదీశ్వరి పాల్గొన్నారు. కోట వద్దనున్న మూడుకోవెళ్ల, శివాలయం వీధిలో ఉన్న ఉమారామలింగేశ్వరాలయం, కొత్త అగ్రహారంలో ఉన్న శివాలయంతో పాటూ పలు శైవక్షేత్రాలలో భక్తులు పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తుల జాగరణ నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఏర్పాటు చేశారు.



విజయనగరం టౌన్: పశుపతి నాథేశ్వర ఆలయంలో విశిష్ట అలంకరణలో పార్వతీపరమేశ్వరులు



విజయనగరం టౌన్: విభూతి అలంకరణలో కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న అతిపురాతన శివలింగం



భోగాపురం: ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్



పశుపతి నాథేశ్వరస్వామిని దర్శించుకుంటున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్

కిటకిటలాడిన శివాలయాలు..

పూసపాటిరేగ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పురాతన కుమిలి ఉమారామలింగేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోనాడ శివాలయానికి తీరప్రాంతంలో వందలాది మంది భక్తులు వెళ్లి పూజలు చేశారు. గోవిందపురం ముక్తిదాం క్షేత్రంలో గల శివాలయంలో భక్తులు గోత్రనామాలతో పూజలు చేశారు. అలాగే పూసపాటిరేగ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న శివాలయంలో శివనామస్మరణ హోరెత్తింది.

వేకువజాము నుంచే..

భోగాపురం: మహా శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయానికి వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సుందరపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు అరవెలపల్లి గురునాథస్వామి, రాధాకృష్ణ, మెడికల్ ఆఫీసర్ వి. కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి పూజలు

విజయనగరం టౌన్: పట్టణంలోని అయ్యకోనేరు దక్షిణగట్టులో ఉమా మహేశ్వరాలయం, రింగురోడ్డు సింహాద్రినగర్‌లో గల సాయిబాబా మందిరంలో కొలువైన ఉమావైద్య నాథేశ్వరాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. దక్షిణగట్టు శివాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు మురపాక శ్రీనివాసశర్మ, సందీప్‌శర్మ శివపార్వతుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఉమా వైద్యనాథుడిని సతీసమేతంగా దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా శివలింగాకతిలో ఆలయంలో దీపారాధన చేశారు. అత్యంత ముఖ్యమైన ఘట్టమైన రుద్రాభిషేకాలను రాత్రి 10గంటల నుంచి 12 గంటల వరకు ఆలయాల్లో అర్చకులు నిర్వహించారు.



విజయనగరం టౌన్: సాయిబాబా ఆలయంలో కొలువైన ఉమావైద్య నాథేశ్వరుడిని సతీసమేతంగా దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



పూసపాటిరేగ : క్యూలైన్‌లో భక్తులు



భోగాపురం: శివాలయంలో భక్తుల రద్దీ



పశుపతి నాథేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పూసపాటిరేగ : మండల కేంద్రంలోని శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పులకించిన రామతీర్థం..



రామతీర్థంలో భక్తుల జాగారం..



సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దంపతులు



కోలాతో రామజపం చేస్తున్న భక్తుడు

రామతీర్థం పుణ్యక్షేత్రం భక్తులతో పులకించింది. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని రామస్వామితో పాటు శివుడ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోలాలు వెలిగించి నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. భగవన్నామస్మరణతో జాగారాలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



ఆలయ ప్రాంతంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



భక్తులను అదుపు చేస్తున్న ఎన్‌సీసీ సిబ్బంది

వైకుంఠ నారాయణుడికి ప్రత్యేక పూజలు



వైకుంఠ నారాయణుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణునికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి వేదమంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం సీతారామయ్య, పద్మశ్రీ దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

శివపార్వతులకు పూజలు..

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామనారాయణంలో శివపార్వతులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు చేపట్టారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఫూల్‌బాగ్ అయ్యప్పనగర్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే హనుమాన్ నగర్‌లో పూర్తయిన రహదారిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. అనంతరం స్వీపర్ కాలనీలో రామాలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఒకటో డివిజన్‌లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత పాలకులు ఒకటో డివిజన్‌ను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఏపీఎన్‌జీఓ ఆధ్వర్యంలో సత్కారం పొందిన మహిళా ఉద్యోగులు



విజయనగరం అర్బన్: మహిళలను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: వివిధ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎన్‌జీఓ హోమ్‌లో వివిధ శాఖలకు చెందిన పలువురు మహిళా ఉద్యోగినులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ జిల్లా పీడీ బి.శాంతికుమారి, మహారాజ హాస్పిటల్ సూపరింటిండెంట్ అనిలా సునందిని, ఏపీజీఎల్ఐ డైరెక్టర్ జి.హైమావతి, జిల్లా ఆడిట్ అధికారి బి.అరుణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సురేష్, పట్టణ అధ్యక్షులు రాజు, సుధ, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్, కేవీ శ్రీను, శ్రీధర్ బాబు, గోపీనాథ్, మహిళా విభాగం తరపున ఆర్.శ్రీస్వప్న, ఆదిలక్ష్మి, ప్రసన్నకుమారి, వి.కోటేశ్వరి, పి.లత, పి.శివలక్ష్మి, జ్యోతిర్మయి, శ్రీవిద్య, రాధిక, తదితరులు పాల్గొన్నారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సత్కారం పొందిన మహిళా ఉద్యోగులు

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినత్సోవం కనపాక యూత్ హాస్టల్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పది మంది వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులను సత్కరించారు. ముఖ్య అతిథిగా మెడికల్ ఆఫీసర్ భాగ్యరేఖ హాజరయ్యారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంది వెంకటరమణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి శంకరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.బాలభాస్కరరావు, సీహెచ్‌వీ సతీష్, అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో..

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో వివిధ వృత్తుల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు మహిళలను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నమూనా పార్లమెంట్



నమూనా పార్లమెంట్‌లో పాల్గొన్న బాలబాలికలు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గురజాడ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 'నమూనా పార్లమెంట్' కార్యక్రమం ఆకట్టుకుంది. దేశ పార్లమెంట్ మాదిరిగా స్పీకర్, ప్రధానమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ప్రతిపక్ష సభ్యులుగా బాల, బాలికలు వ్యవహరించి పలు సమస్యలపై సమీక్షించారు. పాఠశాల కరెస్పాండెంట్ ఎం.స్వరూప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్ల పంపిణీ

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసే పాడి రైతులకు దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. బానాది-2 పాల కేంద్రంలో పాలు సరఫరా చేస్తున్న రైతులకు ప్రోత్సాహం కింద 140 మంది రైతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గొంప వెంకటరావు, సూపర్‌వైజర్ ఎం.నాయుడుబాబు, కార్యదర్శి కండిపల్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.